క్లుప్తంగా

రంగు మారినా మంచి ధరకు కొనాలి

ఆర్డీవో కిశోర్



ఘంటసాల(అవనిగడ్డ): వర్షాలకు తడచి రంగు మారిన ధాన్యంను మరింత మంచి ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నట్టు మచిలీపట్నం ఆర్డీవో ఐ.కిశోర్ చెప్పారు. ఘంటసాల మండలంలోని తాడేపల్లి, ఘంటసాల గ్రామాల్లో శుక్రవారం ఆర్డీవో పలు రైస్‌మిల్లులను పరిశీలించారు. చిట్టూరు రైతుభరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ మిల్లుకు వచ్చిన ధాన్యంను వెంటనే మర ఆడించి ఆ సంచులను రైతు భరోసా కేంద్రాలకు పంపించాలని మిల్లర్లకు ఆదేశించారు. మిల్లర్లు, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రైతులకు ఇబ్బందులు ఎదురైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్దేశించిన మిల్లులో ధాన్యం దిగుమతి చేసుకోక పోతే వెంటనే తహసీల్దార్‌ని సంప్రదించాలని సూచించారు. తహసీల్దార్ బి.రాంనాయక్, ఏవో మురళీకృష్ణ, వ్యవసాయ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు ప్రారంభించండి

మోపిదేవి: జగనన్న లే అవుట్లలో గృహనిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు మరొకసారి చివరి అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ కె.న వీన్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం వెంకటాపురం, అన్నవరం లే అవుట్లలోని లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణ శాఖ ఏఈ రాజులపాటి తాండవకృష్ణ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్థిక స్థోమతలేని లబ్ధిదారులకు డ్వాక్రా గ్రూపులో ఉన్న మహిళలకు గతంలో గ్రూపుల్లో ఉన్న అప్పులకు సంబంధం లేకుండా రూ.35 వేలు సున్నా వడ్డీకే రుణం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆ నిధులతోనైనా తొలుత గృహనిర్మాణం ప్రారంభించాలని లేని పక్షంలో మంగళవారం పట్టాలు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. వీఆర్వో వరప్రసాద్, మాజీ సర్పంచ్ అబ్బూరి నాంచారయ్య పాల్గొన్నారు.

ఆటోలు అతి వేగంతో నడిపితే సీజ్ చేస్తాం



కోడూరు: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రమదాలపై ఆటోవాలాలకు కోడూరు పోలీసులు ప్రత్యేక అవగాహన కల్పించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ ఆటోవాలాలకు వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మితిమిరిన వేగంతో వాహనాలు నడిపే ఆటోలను సీజ్ చేయడంతో పాటు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్, బ్యాడ్జీలు కలిగి ఉండడంతో పాటు నిబంధనల మేరకే ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించుకోవాలని సూచించారు. ఏఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెనొప్పి వచ్చిన గంటలో వైద్యంతో మేలు



మచిలీపట్నంటౌన్: ఆరోగ్యం పట్ల విద్యార్థులు శ్రద్ధ వహించాలని డాక్టర్ ఆర్ రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, రమేష్ హాస్పటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ గుండెనొప్పి వచ్చిన మొదటి గంటను గోల్డెన్‌అవర్‌గా పరిగణించి తక్షణం వైద్యం అందిస్తే ప్రాణహాని ఉండదన్నారు. పాముకాటు, కుక్కకాటులకు తక్షణమే వైద్యం చేయించాలని సూచించారు. అధ్యాపకులు ఎస్ విజయశ్రీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరినాధబాబు, రమేష్ హాస్పటల్ మేనేజర్ మాణిక్యాలరావు, పారామెడికల్ అధ్యాపకురాలు కిరణ్మయి, షాషిదాసుల్తానా, జ్యోతి, స్పందన పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ధాన్యం లారీ

కోడూరు: ధాన్యం లోడు లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన కోడూరులో జరిగింది. కోడూరులోని ఓ ప్రైవేటు రైస్‌మిల్ నుంచి గురువారం రాత్రి లారీ ధాన్యం బస్తాలను వేసుకొని హైదరాబాద్‌కు వెళ్తోంది. వి.కొత్తపాలెం సమీపంలోకి వెళ్లగానే డ్రైవర్ చేతిలో స్టీరింగ్ రాడ్ ఊడిపోయింది. దీంతో డ్రైవర్ లారీని అదుపు చేయలేకపోవడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. 33 కేవీ విద్యుత్ లైన్ తెగిపోయింది. శుక్రవారం ఉదయం వరకు విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు సిబ్బంది శ్రమించారు. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మనది పేద ప్రజల ప్రభుత్వం

- మంత్రి జోగి రమేష్
- సీతనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

కృత్తివెన్ను: పేద ప్రజల ఆకలి బాధలు తీర్చడంతో పాటు వారికి అన్ని సదుపాయాలను సమకూర్చుతున్న మన ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం పేదల ప్రభుత్వమని రాష్ట్ర గృహ నిర్మాణశాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజు సీతనపల్లి ఎస్సీ ఏరియా, కాపుటూరు, సంగమూలి గ్రామాల్లో ప్రతి ఇంటిని మంత్రి సందర్శించారు. అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా బలోపేతులను చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు.

అధికారులకు ఆదేశం

సీతనపల్లి ఎస్సీ ఏరియాలో మంత్రికి స్థానికులు పూలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అయన ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు పలువురు తమకున్న సమస్యలను మంత్రికి తెలిపారు. దీంతో మంత్రి వెంటనే అధికారులను పిలిచి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై మంత్రి ఆరా తీశారు.



సీతనపల్లిలో మహిళకు బ్రోచర్ అందిస్తున్న మంత్రి జోగి రమేష్

విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచిచూశారు.

బాధితులకు ఆర్థిక సాయం

గడప గడపకు మన ప్రభుత్వంలో గృహ సందర్శనలో మంత్రి జోగి రమేష్ తన దయాగుణాన్ని చాటుకున్నారు. కొన్ని చోట్ల వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు తమ ఆర్థిక స్థితి బాగో లేదని కన్నీళ్లు పెట్టుకోవడంతో మంత్రి వెంటనే కొంత నగదును స్థానిక నాయకుల చేతులమీద వారికి అందజేశారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, మహిళావిభాగం మండల కన్వీనర్ జె.ఝాన్సి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు, అగ్రికల్చరల్ మండల చైర్మన్ వి.బాబూరావు, స్థానిక నాయకులు కె.వాసు, ఏసుబాబు, సోమేశ్వరరావు, చినబాబు, శామ్యూల్, ఎంపీడీవో పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ మార్కండేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: ఆముదాలపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ నవరత్నాల పథకాల కరపత్రాలు అందజేసి సమస్యలు తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ చినబాబు, జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, వైస్ ఎంపిపి ఓ.చిన్నారిబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు టి.శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనరు కె.సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.రాజబాబు, తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంపీడీఓ జె.స్వర్ణభారతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలి

పెడన: రంగుమారిన ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం ధర నిర్ణయించిందని, ఆప్రకారం రైతులు నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని పెడన మండల వ్యవసాయశాఖ అధికారి జీవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పుల్లపాడు, కాకర్లమూడి, చోడవరం ఆర్‌బీకేలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడక్కడ ఉన్న రైతులతో, వలంటీర్లతో మాట్లాడి పలు విషయాలను వెల్లడించారు. ఏవో మాట్లాడుతూ రంగు మారిన ధాన్యం విషయంలో 10 శాతం లోపు పాయ ఉంటే వాస్తవ ధరలో 5 శాతం తగ్గించి ధర చెల్లించడం జరుగుతుందన్నారు. వలంటీర్లు రైతులకు అర్థమయ్యేలా చెప్పాల్సిందిగా సూచించారు.

విత్తనాభివృద్ధి చేసుకోవాలి

దక్షిణచిరువోలులంక (అవనిగడ్డ): మినుములో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బీ నవీన చెప్పారు. మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంకలో మినుము యాజమాన్య పద్ధతులపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. నవీన మాట్లాడుతూ మినుములో కలుపు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ పీ శ్రీలత, డాక్టర్ కె రేవతి, డాక్టర్ ఎం వెంకటలక్ష్మీ, దక్షిణ చిరువోలు లంక వీఏలు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్‌ను ఆదరించండి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వేకనూరులో గడప గడపకు మన ప్రభుత్వం

వేకనూరు(అవనిగడ్డ): దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని వేకనూరులో ఎమ్మెల్యే సింహాద్రి శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి, యువనేత సింహాద్రి వికాస్ ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేయడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే మంచి ముఖ్యమంత్రిగా గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. ముందుచూపుతో చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలు వల్ల రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని చెప్పారు. మంచి పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలులోకి వస్తాయని ఎమ్మెల్యే సింహాద్రి తెలిపారు.



వేకనూరులో లబ్ధిదారులకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, తుంగలవారిపాలెం సర్పంచ్ తుంగల వాసు, ఎంపీటీసీ వర్రే నరేష్, గ్రామ కన్వీనర్ తుంగల వేణుగోపాలస్వామి, పార్టీ నాయకులు గరికపాటి కృష్ణారావు, పలువురు నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ బాధ్యతలు చేపడితేనే రాష్ట్రంలోని పేదలకు మరింత న్యాయం జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్, పరిశీలకుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో స్థానిక జెడ్పీ కన్వెన్షన్ హాలులో శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీనవర్గాల ప్రజలను ఆదుకునేందుకు, కులమతాలు, పార్టీలకు అతీతంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్ పిలుపులో భాగంగా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ మరింతగా బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలన్నారు. పార్టీ పరిస్థితులను పరిశీలకులకు ఉన్నది ఉన్నట్లుగా చెప్పాల ని సూచించారు. గ్రామాలు, డివిజన్ల స్థాయి నాయకులతో పార్టీ స్థితిగతులపై పరిశీలకులు ఆరాతీశారు. కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు బర్రే జయరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ నగర, మండల అధ్యక్షులు షేక్ సలార్‌దాదా, లంకే వెంకటేశ్వరరావు, నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు బందెల కవిత, లంకా సూరిబాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, జిల్లా వ్యవసాయ సలహామండలి కమిటీ చైర్మన్ జన్ను రాఘవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

ఉద్యోగులు ప్రజాసేవలో భాగస్వాములు కావాలి

సీఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ సమీర్‌శర్మ

మచిలీపట్నంటౌన్: సచివాలయ ఉద్యోగులు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ప్రభుత్వ మాజీ సీఎస్, సీఎం చీఫ్ ఎగ్జిక్యూటివ్ టు డాక్టర్ సమీర్‌శర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నం లోని 9వ డివిజన్ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న పలు రిజిష్టర్లను పరిశీలించారు. సచివాలయంలో అమలు చేస్తున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల తీరును పరిశీలించారు. డివిజన్‌లోని ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించాలని అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఆరిఫ్‌కు ఆయన సూచించారు. సచివాలయ పరిధిలో ఉన్న పలువురు గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. వారికి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం ఏ విధంగా ఉందని ఏఎన్‌ఎం బి.రంగమ్మను అడిగి తెలుసుకున్నారు. బడిఈడు పిల్లలకు పౌష్టికాహారం ఏ విధంగా అందుతుందోనని సచివాలయ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ రఫత్‌సుల్తానాను ప్రశ్నించారు. మానసిక పరిపక్వత చెందని 14 ఏళ్ల వయసు ఉన్న తుమ్ము వైష్ణవి అనే బాలిక ఆరోగ్యంపై వాకబు చేశారు. 17 సంవత్సరాల గద్దల హర్షవర్ధన్‌తో సమీర్‌శర్మ మాట్లాడారు. మాట్లాడటం రాని వైష్ణవికి స్పీచ్ థెరపి నేర్పేలా చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో జి.గీతాబాయికి సూచించారు. సమీర్‌శర్మ వెంట జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, బందరు ఆర్డీవో ఐ కిషోర్, మునిసిపల్ కమిషనర్ జీ చంద్రయ్య, ఆ డివిజన్ కార్పొరేటర్ రామిశెట్టి వాణిశ్రీ తదితరులు ఉన్నారు.



9వ డివిజన్ సచివాలయంలో మాట్లాడుతున్న సమీర్‌శర్మ చిత్రంలో కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ

సమీర్‌శర్మకు స్వాగతం పలికిన కలెక్టర్, జేసీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పలు కార్యక్రమాల్లో హాజరయ్యేందుకు మచిలీపట్నం కలెక్టరేట్‌కు విచ్చేసిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ టు సీఎం డాక్టర్ సమీర్‌శర్మను కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో గతంలో జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన వారి జాబితాను పరిశీలించారు. అనంతరం సమావేశానికి హాజరయ్యారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- సచివాలయ కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం

కోడూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద పార్టీ నేతలు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ప్రతి సచివాలయ పరిధిలో కన్వీనర్లను నియమించడం జరిగిందని, గృహ సారథుల నియామకాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని రమేష్‌బాబు ఆదేశించారు.ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో ఇప్పటికే నగదు జమ చేశారని, వలంటీర్లు ధాన్యం శాంపుల్స్‌ను ఆర్‌బీకేలకు తీసుకురావాలన్నారు.

విద్యుత్ పనులు ప్రారంభం..

మండలంలోని వేటపాలెం గ్రామంలో విద్యుత్ లైన్ పనులను రమేష్‌బాబు ప్రారంభించారు. గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో ఆ శాఖ ఆధ్వర్యంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడ సెంట్రల్ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, సర్పంచి వెన్నా ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



కోడూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

ధాన్యం రాగానే వెంటనే అన్‌లోడ్ చేయండి

మిల్లర్లకు తహసీల్దార్ ఆదేశం

పెడన: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్ల వద్దకు వచ్చిన సమయంలో వాహనాల్లోని ధాన్యం లోడును అన్‌లోడింగ్ చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పి.మధుసూదనరావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కూడూరు గ్రామంలోని విజయలక్ష్మి రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లు మేనేజర్ రవి, కస్టోడియన్ అధికారి, వీఆర్వో మౌలాలిల నుంచి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. రంగుమారిన ధాన్యం గరించి ఆరా తీశారు. వాహనాల్లో వచ్చే ధాన్యాన్ని తక్షణం దిగుమతి చేసి వాహనాలను త్వరితగతిన వెనక్కు పంపించేలా చూడాలని వారికి సూచించారు. గోనెసంచుల నిల్వలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఈ–క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతు ధాన్యం రైతు భరోసా కేంద్రం ద్వారా సేకరిస్తామని తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లి ఆర్‌బీకే, మణికంఠ రైస్‌మిల్లు శుక్రవారం సందర్శించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి రైతు నష్ట పోకూడదనే ధాన్యం పండించే ప్రతి రైతుకు మద్దతు ధర కల్పించామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ధాన్యం సేకరణలో మిల్లర్ల పాత్రగాని, మధ్యవర్తుల పాత్రగాని లేదని చెప్పారు. దాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే సేకరించిన ధాన్యానికి సంబంధించిన సదరు రైతుకు రశీదు ఇస్తున్నామని తెలిపారు. పారదర్శక విధానంలో తేమశాతం, ధాన్యం రకం, రైతుకు చెల్లించే డబ్బు ఇలా అన్ని రకాల వివరాలూ ఆ రశీదులో ఉంటాయని వివరించారు.



మిల్లర్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదనరావు

కోడూరు: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన గోనె సంచులను సిద్ధంగా ఉంచినట్లు తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా చెప్పారు. కోడూరులోని విఘ్నేశ్వర రైస్ మిల్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిల్వ చేసిన సంచులను పరిశీలించారు. ధాన్యం విక్రయ కేంద్రాల ద్వారా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని, ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర కూడా ఇస్తున్నట్లు తహసీల్దార్ చెప్పారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం పది వేల గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని, అవసరాన్ని బట్టి మరిన్ని సంచులను సిద్ధం చేస్తామని తహసీల్దార్ చెప్పారు. ఆర్‌ఐ సుభాషిణి, ఏఓ భానుప్రకాష్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత పాటించాలని ర్యాలీ

మచిలీపట్నంటౌన్: 34వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శుక్రవారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోనేరు సెంటర్ నుంచి లక్ష్మీటాకీసు సెంటరు వరకు పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత పాటించాలని నినదిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీని జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ ప్రారంభించారు. ఈ ర్యాలీ ముందుభాగాన జేసీతో పాటు జిల్లా అదనపు జడ్జి చిన్నంశెట్టి రాజు, ఏఎస్పీ సీహెచ్ రామాంజనేయులు, డీఎస్పీ మాసూంబాషా, దిశ డీఎస్పీ పీ రాజీవ్‌కుమార్, జిల్లా రవాణాధికారి పీ సీతాపతిరావు, జిల్లా ప్రజారవాణాధికారి జీ నాగేశ్వరరావు, ఆర్టీసీ డీఎం టీ పెద్దిరాజు ఉన్నారు. ర్యాలీ ముగిసిన అనంతరం పలువురు అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు తావు ఇవ్వకుండా ప్రయాణాలు సాగించాలన్నారు. ఈ ర్యాలీలో ఎంవీఐలు బీఎస్ఎస్ నాయక్, ఎండీఎల్ సిద్ధిఖ్, డి సోనీప్రియ, కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పలుశాఖల అధికారులు

మచిలీపట్నంటౌన్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రత పాటించాలని ఇనుగుదురుపేట ఎస్‌ఐ షేక్ ఫిరోజ్‌షా అన్నారు. 34వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని జవ్వారుపేట శ్రీ వేంకటేశ్వర పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, 25, 26 సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరుపై ఆరా



అరిశేపల్లిలో రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న వ్యవసాయశాఖ అధికారులు

కోనేరుసెంటర్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం పర్యటించారు. రైతుభరోసాకేంద్రాల ద్వారా చేస్తున్న ధాన్యం కొనుగోలుపై రైతులతో మాట్లాడారు. రైతులకు ఎటువంటి ఖర్చు లేకుండా, ఇబ్బందులు పడకుండా కళ్లాల నుంచే ప్రభుత్వం ధాన్యాన్ని సేకరిస్తూ రైతులకు కల్పిస్తున్న సదావకాశంపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుభరోసాకేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయటాన్ని రైతులు హర్షించటంతో పాటు ధాన్యాన్ని అమ్మిన 21 రోజుల్లో నగదు తమ ఖాతాల్లో జమ కావటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ కే శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం అమ్మిన రైతులకు 21 రోజుల్లో నగదు జమ కాకుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వెంటనే పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు దళారీలను ఆశ్రయించి మోసపోవద్దని రైతులకు అవసరమైన సంచులు, ధాన్యం సేకరణ అన్నీ ప్రభుత్వమే చూసుకుంటుందని తెలిపారు. మండల వ్యవసాయశాఖాధికారి జీవీ శివప్రసాద్, అసిస్టెంట్ సీహెచ్ హర్షిత, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రుస్తుంబాద, చెమ్మనగిరిపేట, రాజాగారిసెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మెరిట్ విద్యార్థులకు ఎల్ఐసీ ప్రోత్సాహం



బంటుమిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరిట్ విద్యార్థులు మరింత కష్టపడి ఉన్నత స్థాయికి చేరేందుకు ఎల్ఐసీ మెరిట్ అవార్డులతో సత్కరిస్తున్నదని మచిలీపట్నం సిటీ బ్రాంచ్–2 మేనేజరు ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గత సంవత్సరం 6 నుంచి 10 వరకు ప్రతిభ చూపిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం సీహెచ్.రామచంద్రరావు అధ్యక్షతన ఎల్ఐసీ మేనేజరు సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, అవార్డులు అందజేసి అభినందించారు. మేనేజరు మాట్లాడుతూ క్రమశిక్షణ, కష్టపడితేనే ఉత్తమ విద్య అందుతుందన్నారు. ఏబీఎం అగస్టీన్, క్లియా అడ్వైజర్లు యూపీఆర్ విఠల్, సీహెచ్‌వీఎస్ఎస్ మల్లికార్జునరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డు శానిటేషన్ కార్యదర్శులకు నోటీసులు జారీ

పెడన: పట్టణంలోని వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులకు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శుక్రవారం నోటీసులు జారీ చేశారు. శానిటేషన్ కార్యదర్శులు ప్రతి రోజూ ఉదయం ఐదు గంటలకు పారిశుద్ధ్య కార్మికులకు హాజరు వేసే సమయానికి ఉండాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. లేనిపక్షంలో 1965 సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల పట్టణంలో శానిటేషన్‌పై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, పరిష్కరించే దిశగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.